# ‘ఆటో, టాటా మ్యాజిక్‌లకు రోడ్డు టాక్స్ రద్దుచేయాలి’




బందరులో ధర్నా

**బందరు, 26-4-16 :**

**ఆటో,** టాటామ్యాజిక్ రోడ్‌టాక్స్ రద్దుచేయాలని, పెంచిన బీమాచార్జీలను, లేబరు సెస్‌లను రద్దు చేయాలని, జరిమానాలు, అపరాధ రుసుములు వసూలు పేరిట ఆటో, టాటామ్యాజిక్ వర్కర్స్‌పై జరిగే వేధింపులను నిలుపుదల చేయాలని, కార్మికుల సంక్షేమం కొరకు బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ మచిలీపట్నం ‘టౌన్ ఆటోవర్కర్స్ యూనియన్’, ‘అభ్యుదయ టాటామ్యాజిక్ వర్కర్స్ యూనియన్’ (ఏఐఎఫ్‌టియు-న్యూ అనుబంధం) ఆధ్వర్యంలో 26-4-2016 తేదీన మచిలీపట్నం కలక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ధర్నాను ఉద్దేశించి ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥యద్దనపూడి సోని ప్రసంగిస్తూ రోడ్డు రవాణా విభాగాన్ని పాలకులు ప్రైవేటీకరించబోతున్నా రన్నారు. పన్నుల “సంస్కరణల”ను మొదలుపెట్టారని, అందులో భాగంగానే రోడ్డు టాక్స్‌ను పెంచారని, ఇన్సూరెన్స్ ప్రీమియం చార్జీలు పెంచారని, అంతేకాక కార్మిక సంక్షేమం ముసుగులో కార్మికశాఖ ద్వారా లేబర్‌సెస్ పేరిట వసూళ్ళ ప్రారంభించారన్నారు. ఆటో, టాటామ్యాజిక్, కారు, మోటారుసైకిళ్ళు, ట్రక్కు, చిన్న లారీలు నడిపే కార్మికులపై అంతులేని భారాలు మోపారని, ఇప్పటికే వాహనాలు నడిపే కార్మికులనుండి జరిమానాలు, అపరాధరుసుముల వసూలు పేరుతో పోలీసులు, రోడ్డురవాణా అధికార్లు అనేక వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఒక ప్రక్క ఆటోలు, టాటా మ్యాజిక్‌లను అప్పుచేసి కొన్నందుకు చక్రవడ్డీలతో జరుగుతున్న దోపిడి; కనీస అవసరాలు తీర్చుకోలేక అప్పులుపాలై కృంగిపోవడం జరుగుతోందన్నారు. ఈ స్థితిలో రోడ్డు టాక్స్‌లు, ఇన్సూరెన్స్‌ను పెంచి, వసూలుకు పూనుకోవడం దుర్మార్గమని, ప్రజావ్యతిరేక విధానాలను చేపట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, పాలకులను ఓడించేందుకు కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥వడ్డాది లక్ష్మణరావు, కా॥ముచ్చు సుధాకరరావు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండుచేశారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా సహాయకార్యదర్శి కా॥జె.జగన్, జిల్లా నాయకులు కా॥ఈపూరి రాంబాబు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా ఉపాధ్యక్షురాలు కా॥పామర్తి అంజమ్మ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెల్పారు.

అనంతరం పలు డిమాండ్లతో కూడిన మెమోరాండంను జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ద్వారా కలెక్టరుగార్కి అందించారు. మచిలీపట్నంలోని చిలకలపూడి, పెదకరగ్రహారం, ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండు, కోనేరుసెంటర్, కోటవారితుళ్ళ, ఆంధ్రా హాస్పిటల్ సెంటర్ల స్టాండులనుండి ఆటో వర్కర్స్, టాటామ్యాజిక్ వర్కర్స్ ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాకు ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ముచ్చు సుధాకరరావు, ఏసు, తిరుమలరావు, శాంతిబాబు, నాంచారయ్య, వెంకట్రావ్, వేల్పుల నాగేశ్వరరావు, రాజు, వెంకటేశ్వరరావులు నాయకత్వం వహించారు. ధర్నాకు ముందు సమస్యలను వివరిస్తూ కరపత్రం తీసుకొచ్చి ఆటో, టాటా మ్యాజిక్ వర్కర్స్‌లో విస్తృతంగా ప్రచారం చేశారు.

oooooo